ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శుక్రవారం 12 జనవరి 2024

సిర్సవాడలో 105 సంవత్సరాల వృద్ధురాలి మృతి

తాడూరు, జనవరి 11 : నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడలో 105 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలు గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరామమ్మ (105)కు ఎనిమిది మంది సంతానం కాగా ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులు 135 మందికి పైగా ఉన్నారు. గత సంవత్సరం ఈ వృద్ధురాలికి 104 సంవత్సరాలు నడుస్తున్న క్రమంలో శతాబ్ది ఉత్సవాలు సైతం నిర్వహించి పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యులు పాల్గొని వెంకటరామమ్మను సన్మానించారు. మొత్తంగా 105 సంవత్సరాల వయస్సు కలిగిన మూడు తరాల పిల్లలను చూసిన వృద్ధురాలు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయాలు అలుముకున్నాయి.

పాలమూరుపై.. కమలం కసరత్తు

- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు
- ఎనిమిది పర్యాయాల్లో ఒక్కసారి గెలుపు
- ఇరవై ఏళ్లలో స్థిరంగా పెరుగుతూ వస్తోన్న ఓటు బ్యాంకు
- రేసులో డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, శాంతకుమార్
- టికెట్‌పై ఎవరి ధీమా వారిదే
- కార్యక్రమాల్లో వేగం పెంచిన ఆశావహులు
- పార్టీ పరిస్థితిని విశ్లేషిస్తోన్న అధిష్ఠానం

మహబూబ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాబోయే ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా బీజేపీ కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయి వరకు బలమైన సంస్థాగత నిర్మాణం, దీటైన నాయకత్వం కలిగి ఉండడం, జాతీయ స్థాయి అంశాలతో ప్రభావితమయ్యే నియోజకవర్గమవడంతో ఇక్కడ గెలుపుని ఆపార్టీ లక్ష్యంగా నిర్దేశించుకొంది. 20 ఏళ్లలో 1999లో ఏపీ జితేందర్‌రెడ్డి పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన సందర్భంలో తప్ప మిగిలిన అన్ని ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు సాధిస్తున్నప్పటికీ గెలుపు తీరం చేరకపోవడంపై పార్టీలో లోతైన విశ్లేషణ సాగుతోంది. పార్టీలో అంతర్గతంగా ఈ కసరత్తు సాగుతుంటే, మరోవైపున ఇక్కడ పోటీ చేసేందుకు సిద్ధమవుతోన్న కీలకనేతలు నియోజకవర్గంలో కార్యక్రమాల వేగం పెంచారు. పార్లమెంట్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావుని నియమించిన అధిష్ఠానం ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తోంది.

పెరుగుతూ వచ్చిన ఓటు బ్యాంకు..

జనసంఘ్ కాలం నుంచి ఈ నియోజకవర్గంలో స్థిరమైన క్యాడర్ కలిగిన పార్టీ, 1991 నుంచి బలమైన ఓట్లు సాధిస్తోంది. 1999లో ఒక పర్యాయం విజయం సాధిస్తే, 2019లో ద్వితీయ స్థానంలో నిలిచింది. మిగిలిన అన్నిసందర్భాల్లో మూడోస్థానంలో కొనసాగుతోన్న పార్టీ ఈసారి విజయం కోసం తీవ్ర కసరత్తు చేస్తోంది. 1991 నుంచి 2019 వరకు జరిగిన ఎన్నికలు పరిశీలిస్తే 2009లో అప్పటి ఉద్యమనేతగా కేసీఆర్ పోటీ చేసిన సందర్భం మినహా, మిగిలిన అన్ని ఎన్నికల్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. 1991లో పార్టీ అభ్యర్థి సుబ్బారెడ్డి 21.13శాతం ఓట్లతో మూడోస్థానం సాధిస్తే, 1996లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి 17.34 శాతం ఓట్లతో మూడోస్థానంలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో నిలిచిన డీకే అరుణ 35.03శాతం ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉండడంతో పాటు, స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 1996లో ఎన్టీఆర్ టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి దాదాపు 8శాతం ఓట్లు సాధించిన జితేందర్‌రెడ్డి, 1998లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి 27.69 శాతం ఓట్లు సాధించి మూడోస్థానంలో నిలిచారు. 1999లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించిన ఏపీ జితేందర్‌రెడ్డి మొదటిసారి ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 49.46 శాతం (3,91,588) ఓట్లు వస్తే, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లికార్జున్‌కు 43.03శాతం(340693 ఓట్లు) దక్కాయి. 2004 ఎన్నికల్లో పొత్తులో ఈ సీటుని టీడీపీకి ఇవ్వడంతో ఇక్కడ బీజేపీ బరిలో లేదు. 2009లో మాత్రం పార్టీ అభ్యర్థి యాదగిరిరెడ్డికి కేవలం 4.23 శాతం ఓట్లే దక్కాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ అలయెన్స్‌తో బరిలో నిలిచిన డాక్టర్ నాగం జనార్ధన్‌రెడ్డి 19.23శాతం ఓట్లు సాధించి మూడోస్థానంలో నిలిచారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ మంత్రి డీకే అరుణ 33.87శాతం ఓట్లతో ద్వితీయస్థానంలో నిలిచారు. మొత్తంగా ఈ ఇరవై ఏళ్లలో ఇక్కడ పార్టీ ఓటుబ్యాంకు స్థిరంగా పెరగడాన్ని గమనిస్తోన్న అధిష్ఠానం గతంలో వైఫల్యాలకు గల కారణాలను విశ్లేషించిందని, ఈ సారి పక్కాప్రణాళికతో గెలుస్తామనే ధీమాని క్యాడర్‌కు అందిస్తోంది.

ఎంపీ టికెట్ రేసులో ఆ ముగ్గురు







మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలవడం, పార్టీ జాతీయ స్థాయిలో బాధ్యతల్లో ఉండడం, అయిదేళ్లుగా క్యాడర్‌కు అందుబాటులో ఉండడం, ఇక్కడ బీఆర్‌ఎస్‌పై బలంగా పోరాడుతున్న నేపథ్యంలో ఈసారి కూడా అధిష్ఠానం పోటీ అవకాశం తనకే ఇస్తుందనే ధీమా డీకేఅరుణలో వ్యక్తమవుతోంది. మరోవైపు మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి సైతం టిక్కెట్ విషయంలో అంతేధీమాగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఒక పర్యాయం బీజేపీ అభ్యర్థిగా, మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన ఆయన పార్టీ అభ్యర్థిత్వానికి గట్టిపోటీదారుగా ఉన్నారు. 28 ఏళ్లుగా తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నానని, తన హయాంలోనే రైల్వే డబ్లింగ్, పాస్‌పోర్టు కార్యాలయం, సీసీఐ బ్రాంచి, జాతీయ రహదారుల ప్రాజెక్టులు తెచ్చామని పేర్కొంటున్న ఆయన అధిష్ఠానం తనకే అవకాశమిస్తుందనే ధీమాలో ఉన్నారు. ఈ ఇద్దరు కీలక నేతలతో పాటు ఈ సారి బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ సైతం పార్టీ అభ్యర్థిత్వం కోసం బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2014లో, 2019లో రెండుసార్లు అధిష్ఠానం సూచనల మేరకు పోటీ ఛాన్స్ వదులుకొని, పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల కోసం పనిచేశానని ఈ దఫా తనకే అవకాశం వస్తుందని ఆయన భావిస్తున్నారు. బీసీ సమీకరణ, ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం, రెండుసార్లు టిక్కెట్ వదులుకోవడం వంటి అంశాలు కలిసొస్తాయని ఆశిస్తున్నారు. ఈ ముగ్గురు నేతలూ పోటాపోటీగా నియోజకవర్గంలో పర్యటిస్తూ, సమావేశాలు నిర్వహిస్తుండడం ఆసక్తిని రేపుతోంది.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 11: దివ్యాంగుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డిసెంబరు 3న నిర్వహించవలసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని శాసనసభ ఎన్నికల కౌంటింగ్ కారణంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దివ్యాంగుల కోసం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సన్నిధి, శాంతివనంతో పాటు ప్రైవేట్ వారు కూడా పాఠశాలలు నెలకొల్పారని, ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం కూడా సహకారం అందించడం అభినందనీయమన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలలో అవుట్ సోర్సింగ్ ద్వారా ఖాళీగా ఉన్న దివ్యాంగ పోస్టులలో వారినే తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో ప్రతీవారం సదరం శిబిరం నిర్వహించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు ఇస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిణి జ్యోతి దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘాల తరపున శ్రీనివాస్, అందుల అసోసియేషన్ కార్యదర్శి ముంతాజ్, చిక్క హరీష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో, దివ్యాంగుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో గెలుపొందిన దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆలింకో కంపెనీ ఆధ్వర్యంలో ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల అభివృద్ధికి కృషిచేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు లయన్ నటరాజ్ తదితరులు ఉన్నారు.

సెలవులొచ్చాయ్..



విద్యార్థులతో కిటకిటలాడుతున్న వనపర్తి ఆర్టీసీ బస్టాండ్



వనపర్తి బస్టాండ్‌లో సీటు కోసం కిటికీలోంచి బ్యాగులు వేస్తున్న విద్యార్థులు



కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వెళ్తున్న పుల్లూరు గురుకుల విద్యార్థులు

వనపర్తి రూరల్/అచ్చంపేట టౌన్/ అలంపూర్ చౌరస్తా/మానవపాడు, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు నేటి నుంచి 17 వరకు సంక్రాంతి పండుగ సెలవులను ప్రకటించింది. ఆరు రోజులు సెలవులు రావడంతో బస్టాండ్ల వద్ద సందడి నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలోని వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్లేందుకు గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా వసతి గృహాల వద్దకు చేరుకున్నారు. పాఠశాల సమయం ముగిసే దాకా వేచి ఉండి తమ పిల్లలను వారి బ్యాగులతో సహా ఇళ్లకు తీసుకువెళ్లారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రద్దీగా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉన్న నేపథ్యంలో ఎక్కువ శాతం తమ పిల్లలను తీసుకువెళ్లేందుకు వారే రావడంతో బస్సులన్నీ మహిళలతో నిండిపోయాయి. గ్రామాలకు పూర్తిస్థాయిలో బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. దీంతో ఆటోలు, జీపులకు భలే గిరాకీ తగిలింది.

కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామాలకు వెళ్తున్న వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీప గురుకుల విద్యార్థులు





సొంత గ్రామాలకు వెళ్లేందుకు లగేజీతో వనపర్తి బస్టాండ్‌కు వస్తున్న వసతిగృహం విద్యార్థులు



విద్యార్థులతో రద్దీగా మారిన అచ్చంపేట బస్టాండ్



వనపర్తి బస్టాండ్‌లో జనం అధికంగా ఉండటంతో కిటికీలోంచి బస్సు ఎక్కుతున్న విద్యార్థిని, సీటు కోసం బ్యాగు వేస్తున్న విద్యార్థి



అలంపూర్ చౌరస్తా వద్ద బస్సు ఎక్కేందుకు గుమికూడిన విద్యార్థులు

అడుగంటుతున్న.. ఆశలు

- నాగర్‌కర్నూల్ జిల్లాలో పడిపోయిన భూగర్భ జలాలు
- 26 శాతానికి తగ్గుదల
- ఎండుతున్న పంటలు

జిల్లా భూగర్భ జలాల వివరాలు(మీటర్లలో..)

నెల	సాధారణం	నమోదు
జూన్	12.92	7.30
జూలై	12.52	7.56
ఆగస్టు	12.04	7.36
సెప్టెంబరు	11.47	6.41
అక్టోబరు	10.41	6.95
నవంబరు	10.67	7.45
డిసెంబరు	10.96	7.91



ఎద్దుమిట్ట తండాలో నీరందక ఎండిన వేరుశనగ పంటను గొర్రెలు మేపుతున్న రైతు

అచ్చంపేట, జనవరి 11: ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. దాంతో యాసంగి పంట చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ యాసంగిలో 2,26,039 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. ఒక్క వేరుశనగ పంటనే లక్షా 2,063 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా సాధారణ వర్షపాతం 593.3 మిల్లీ మీటర్లు కాగా, ప్రస్తుతం 442.1 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. వర్షాలు లేక -26 శాతం భూగర్భ జలాలు పడిపోయాయి. వేసవి రాకముందే భూగర్భ జలాలు పడిపోతుడటంతో మునుముందు తాగునీరు కూడా అందడం కష్టమౌతుందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అచ్చంపేట నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లో నీరులేక వేరుశనగ పంటలు ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండుతున్నా రైతులు ఏం చేయలని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి, బోర్లు తవ్విస్తున్నారు.

వేరుశనగ వేసి అప్పుల పాలయ్యాను



ఈ యాసంగిలో ఎకరంన్నర పొలంలో వేరుశనగ పంట వేసిన. మొదట బోరు నీళ్లు బాగానే పోసేది. పది నల్లాలు కొట్టేది. నెల రోజులుగా నీళ్లు రావడం లేదు. చేతికొచ్చే ముందల పంట ఎండుతుంటే బాధ అయ్యి రూ.40 వేలు పెట్టి మళ్లీ బోరు ఏపించిన. కొచెం నీళ్లు పడ్డవి. కానీ పంట పండేటట్లు లేదు. పంట వేసి అప్పులపాలైన.

-నోముల లింగమయ్య యాదవ్, రాయిచేడి



ఎద్దుమిట్ట తండాలో పంటను రక్షించేందుకు తవ్వుతున్న బోరు



పంటకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన పాంపండ్

లద్దమడుగు.. కాల్వ కబ్జా

- కోస్గి పట్టణంలో కాల్వ మధ్యలో భవన నిర్మాణం
- తొలగించాలని ఇరిగేషన్ అధికారుల లేఖ
- రెండేళ్లుగా మునిసిపల్ అధికారుల కాలయాపన

కోస్గి రూరల్, జనవరి 11: మండలంలోని దండం చెరువు, నాగుల చెరువు, ఉప్పు సముద్రం, దేవుడి చెరువు, అబ్లి చెరువులు అలుగు పారినప్పుడు నీళ్లు వెళ్లే ప్రధాన లద్దమడుగు కాల్వ కోస్గి పట్టణంలో కబ్జాకు గురైంది. గత పాలకుల పుణ్యమా అంటూ ఈ కాలువ కబ్జాకు గురవడంతో వర్షా కాలంలో చెరువులు అలుగులు పారినప్పుడల్లా నీరంతా కోస్గి పట్టణంలోని బాహర్‌పేట, శంభునిగుడి పరివాహక ప్రాంతాల్లో చేరుతోంది. ఏడాదిన్నర క్రితం ఇరిగేషన్ అధికారులు కాల్వను సర్వే చేశారు. కాలువలో మహబూబ్‌నగర్ రోడ్డు పక్కన చేపట్టిన భవన నిర్మాణాన్ని వెంటనే కూల్చేయాలని మునిసిపల్ అధికారులకు లేఖ పంపారు. ఇరిగేషన్ కాలువలో భవనాన్ని నిర్మించారు. ఈ కాల్వ ద్వారా మాసాయిపల్లి పరం చెరువుకు నీరు వెళ్తది, ఇలా కబ్జా చేయవద్దు కానీ రాజకీయ ఒత్తిళ్లతో చేసేదిలేక మునిసిపల్ అధికారులు మౌనంగా ఉండిపోయారు. ప్రస్తుతం భూత్పూర్-చించోళి హైవే పనుల్లో భాగంగా ఈ కాలువపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దాంతో రోడ్డు పక్కన ఈ భవనం కాల్వ మధ్యలో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తారో? లేదో? చూడాలి. కాగా ఈ భవన నిర్మాణం అక్రమమని తెలిసి కూడా మునిసిపల్ అధికారులు ఇంటి నెంబర్ కూడా ఇచ్చారన్న చర్చ సాగుతోంది.



కాల్వ మధ్యలో అక్రమంగా నిర్మించిన భవనం

భవనాన్ని కూల్చాలని నివేదిక ఇచ్చాం



ఈ భవన నిర్మాణం పాటు కాల్వలో ఉంది, దీన్ని కూల్చాలని మునిసిపల్, రెవెన్యూ అధికారులకు 2022 సెప్టెంబరు 20న లేఖ పంపించినా ఎవరూ స్పందించ లేదు. దండం చెరువు అలుగు పారితే నీటి ప్రవాహం అక్కడ ఎలా ఉంటదో తెలుస్తది. కోస్గి మండలంలో గొలుసు కట్టు చెరువులు ఎక్కువగా ఉన్నాయి. ఇలా పాటు కాలువలు కబ్జా చేస్తే.. చెరువులు నిండవు. పాటు కాలువలు అక్రమించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. మేము నివేదిక ఇచ్చి, కాలువలు చూపిస్తాం. భవనాలు కూల్చే అధికారం మాకు లేదు. మునిసిపల్ అధికారులకే ఉంటుంది.

- ఆనంద్‌కిషోర్, ఇరిగేషన్, డీఈ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

జడ్చర్ల, జనవరి 11 : జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లి సమీపంలో బుధవా రం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించినట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. జడ్చర్ల మండలంలోని నెక్కొండ గ్రామానికి చెందిన కమ్మరి నర్సిములు(59)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. వడ్లు విక్రయిం చేందుకు నెక్కొండ నుంచి జడ్చర్లకు వచ్చిన నర్సిములు, తిరిగి రాత్రి నెక్కొండ కు వెళ్తుండగా కుర్వగడ్డపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సం ఘటనలో నర్సిములు అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సిములు కుమారుడు కమ్మరి శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ వివరించారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

నవాబ్‌పేట, జనవరి 11 : భార్య కాపురానికి రావడం లేదని మన స్తాపం చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్న సంఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన(32)కు ఏడేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన శివలీలతో వివాహం జరిగింది. రెండేళ్లుగా శివలీల కాపురానికి రాకపోవడంతో వారం రోజుల క్రితం తన బంధువులతో కలిసి కుల పెద్దల సమక్షంలో పంచాయి తీ పెట్టి మాట్లాడారు. దీంతో భార్య, అత్తామామలు చిన్నను తిట్టడంతో పాటు కాపురానికి పంపమంటూ చెప్పడంతో మనస్తాపం చెందిన చిన్న ఇంటికి వచ్చి తెల్లవారు జామున చీరతో ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శేఖరమ్మ ఉదయం లేచి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హైనా దాడిలో రెండు దూడలు మృతి


మృతి చెందిన దూడ

జడ్చర్ల, జనవరి 11 : జడ్చర్ల మం డలంలోని ఆలూ రు, బూర్గుపల్లి గ్రా మాల మధ్య వ్యవ సాయ పొలంలో ఉన్న బర్రెదూడల పై హైనాలు దాడి చేశాయి. బుధవా రం అర్ధరాత్రి అ నంతరం హైనాల దాడిలో ఆలూరు గ్రామానికి చెందిన సత్యనారాయణకు చెందిన రెండు బర్రె దూడలు, మల్లేష్‌కు చెందిన ఒక బర్రెదూడ మృతిచెందాయి. వ్యవసా య క్షేత్రంలో బర్రెలను కట్టేశామని, హైనాలు దాడి చేసి దూడలను చంపాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


నాగరాజు (ఫైల్)

పాన్‌గల్, జనవరి 11 : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పాన్గల్ మండలం రేమద్దుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వేణు తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు (39) అదే గ్రామానికి చెందిన రైతు దయాకర్‌కు చెందిన వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. బుధవా రం వ్యవసాయ మోటారును ఆన్ చేసేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడన్నా రు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ యువజన ఉత్సవాలకు శివకుమార్ ఎంపిక

కల్వకుర్తి, జనవరి 11 : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకా నంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొననున్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం నుంచి 16వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని మహబూబ్‌నగర్ జిల్లా యువజన అధికారి కోటానాయక్ ద్వారా ఆహ్వానం అందినట్లు ఆయన పేర్కొన్నారు. భార తదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఉత్తమ యువజన సేవలందించిన యువ త పాల్గొనే యువజన ఉత్సవాలకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి ఉత్సవాలకు తాను ఎంపిక కావడం ఆనందంగా ఉందని శివకుమార్ తెలిపారు.

ఆర్టీఎస్ కాలువకు నీరు నిలిపివేత

- డ్యాంలో నీరు లేదంటున్న అధికారులు
- నెలాఖరులో ఒక తడికి నీరు ఇవ్వాలన్న రైతులు



డిస్ట్రిబ్యూటర్-25 కింద సాగైన మొక్కజొన్న పంట

వడ్డేపల్లి, జనవరి 11 : ఆర్డీఎస్ కాలువకు నీరు నిలిపివేయడంతో వారు ఆందోళ చెందుతున్నారు. కాలువ నీటిని నమ్ముకుని రబీలో రైతులు ఇరవై వేల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలను సాగు చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటిపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో పది టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని, ఆ నీటిని తాగునీటి కోసం ఉంచినట్లు చెప్తున్నారు. కాలువకు సాగునీరు వదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని, సాగునీరందకపోతే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. వడ్డేపల్లి మండలంలో రైతులు తొమ్మిది వేల ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు, మానవపాడు మండలంలో పదివేల ఎకరాలకు పైగా మిరప, ఇతర రకాల పంటలు సాగు చేశారు. మిరప పంట రెండో దశ కోత కోయలేదని రైతులు చెప్తున్నారు. ఈనెలాఖరుకు, లేదా వచ్చేనెల మొదటి వారంలో ఒక తడికి నీరు ఇస్తే పంటలు చేతికి వస్తాయని చెప్తున్నారు. కాగా, తెలంగాణ నీటి వాటా అయిపోయిందని అధికారులు స్పష్టం చేయడంతో ఆందోళన చెందుతున్నారు.



నీరు లేక వెలవెలబోతున్న ఆర్టీఎస్ కాలువ

పది ఎకరాల్లో మిరప సాగు



ఆర్డీఎస్‌ను నమ్ముకుని పది ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. అందుకు ఆరు లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాను. ఆకస్మాత్తుగా నీరు నిలివేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాను. మిరప రెండవ కోత కూడా కాలేదు. ఫిబ్రవరిలో మొదటి వారంలోనైనా సాగునీరు అందిస్తే కొంత ఉపశమనం కలుగుతుంది.

- చిన్న శంకరన్న, రైతు, మానవపాడు

రెండు ఎకరాల్లో మొక్కజొన్న



ఆర్డీఎస్ కెనాల్ కింద రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరు అందకపోతే ఎండిపోయే ప్రమాదముంది. ఫిబ్రవరి వరకు నీరు ఇస్తారన్న ఉద్దేశంతో సాగు చేశాను. నీరివ్వకపోతే అప్పుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి.

- హనుమంతు, రైతు, శాంతినగర్

తెలంగాణ వాటా అయిపోయింది..

తుంగభద్ర డ్యాంలో కేవలం పది టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీటిని తాగునీటి కోసం నిల్వ ఉంచాము. తెలంగాణ ఇండెంట్ వాటా కూడా అయిపోయింది. రబీలో పంటలు వేసుకోవద్దని రైతులకు ముందే చెప్పాము. ప్రకృతి కనికరించి, వరాలు పడితేనే సాగునీరు అందించే అవకాశం ఉంది. ప్రస్తుతం కాల్వకు నీరు విడుదల చేసే పరిస్థితి లేదు.

- శ్రీనివాసులు, ఆర్టీఎస్ డీఈ

పేకాట స్థావరాలపై మెరుపు దాడి

- 15 ద్విచక్ర వాహనాలు, రూ.4,08,000 నగదు స్వాధీనం
- పోలీసుల అదుపులో 18 మంది

ధరూరు, జనవరి 11 : ధరూరు మండల పరిధిలోని జాంపల్లి శివారులో తాయమ్మ మిట్ట వద్ద గత కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో గురువారం పోలీసులు మెరుపుదాడి చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాంపల్లి గ్రామ శివారులో, ధరూరు మండల కేంద్రంతో పాటు రాయచూరు, గద్వాల, మల్దకల్ తదితర ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గద్వాల సీఐ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ భగవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం పేకాట స్థావరాలపై దాడులు చేసి, 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 15 ద్విచక్రవాహనాలతో పాటు, రూ.4,08,000 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దాడుల్లో ధరూరు ఎస్ఐ శివానందగౌడ్, కేటీదొడ్డి వెంకటేష్, ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

- గట్టు మండల కేంద్రంలో ఉద్రిక్తత



గట్టులో అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న దృశ్యం

గట్టు, జనవరి 11 : మండల కేంద్రంలోని అక్రమ నిర్మాణం కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మాజీ సర్పంచ్ పావని కృష్ణ చేపట్టిన భవన నిర్మాణంపై గతంలో వివాదం నెలకొన్నది. దీంతో పనులను నిలిపివేసిన వారు, ఇటీవల మళ్లీ ప్రారంభించి, శ్లాబ్ పూర్తి చేశారు. భవనం నిర్మించిన స్థలం గ్రామ కంఠంలోనిదని, నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతి లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు కూల్చివేతకు అదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో గట్టు, మల్దకల్, కేటీదొడ్డి ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది గురువారం ఉదయాన్నే గట్టుకు చేరుకున్నారు. అక్రమ నిర్మాణం కూల్చివేత ప్రారంభించారు. ఆ ప్రాంతానికి ఇతరులెవరూ రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పావని, కుటుంబసభ్యులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశంతో కూల్చివేస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. కూల్చివేత పూర్తయిన తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లి పోయారు.

కిరాణ దుకాణాల్లో తనిఖీలు



ఖిల్లాఘణపురంలోని కిరాణ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి నీలిమ

ఖిల్లాఘణపురం, జనవరి 11 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలను గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారి నీలిమ తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్ మురళి, రవి, నరహరి, దశరథం, కుబేరస్వామి కిరాణా దుకాణాల్లో శాంపిల్స్ సేకరించారు. కిరాణాల్లో అమ్ముతున్న నిత్యావసర సరుకులు, నూనె, అల్లం, వెల్లుల్లి పేస్టులను శాంపిల్స్ కోసం సేకరించారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షిస్తామని అధికారి నీలిమ తెలిపారు. రిపోర్టులు వచ్చిన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సెక్షన్ అధికారి వాజిద్ పాల్గొన్నారు.

గ్రామీణ స్థితిగతులపై అవగాహన



గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రేవల్లి, జనవరి 11 : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామస్థులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయ బీఎస్సీ విద్యార్థినులు గ్రామీణ స్థితిగతులపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామీణ కుటుంబ సభ్యులపై అధ్యయనం చేయడానికి విద్యార్థినులు పది మంది చెన్నారం గ్రామాన్ని ఎన్నుకొని దాదాపు రెండునెలల పాటు అదే గ్రామంలో నివసించారు. గ్రామస్థుల ఆరోగ్యం, పోషకాహారం, పిల్లల పెంపకం, విద్య ప్రాముఖ్యత, వృత్తులపై అధ్యయనం చేసి వాటి గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిసరాల పరిశుభ్రత, గ్రామ పటం మొదలైన వాటిని చార్ట్ చిత్రాల రూపంలో ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త అనిత, గ్రామ సర్పంచ్ రమేష్, చైర్మన్ భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్



ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్

ఆత్మకూరు, జనవరి 11 : ఆత్మకూరు, అమరచింత పట్టణాల అభివృద్ధిపై కమిషనర్లు దృష్టి సారించి అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్లు నాగరాజు, మహమ్మద్ ఖాజాలను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు, అమరచింత పట్టణాల్లోని ప్రకృతివనాలు, క్రీడా మైదానాలను మునిసిపల్ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పట్టణ ప్రకృతి వనాలను అందంగా తీర్చిదిద్దారని, అలాగే క్రీడా మైదానాలను క్రీడాకారులు వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తు నమోదు ప్రక్రియను పరిశీలించి, ఈనెల 17వ తేదీలోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు, అమరచింత చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజాతో పాటు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు కుట్టేందుకు టెండర్ల ఆహ్వానం

మహబూబ్‌నగర్(విద్యావిభాగం), జనవరి 11 : మహబూబ్‌నగర్ రీజియన్‌లో గల తెలంగాణ ఏకలవ్య మాడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్ బాలానగర్, కల్వకుర్తి పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థులకు యూనిఫాం దుస్తులు కుట్టేందుకు ఏజెన్సీ, టెండరుదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెండరు దారులు రూ.500 చెల్లించి దరఖాస్తు ఫారాలు పొందాలని, ఈనెల 12 నుంచి 19వ తేదీలోగా ఆర్‌సీవో కార్యాలయం తిరుమల హిల్స్ అప్పన్నపల్లిలో సమర్పించాలని కోరారు.

అభివృద్ధిపై ప్రణాళిక తయారు చేయాలి

- ప్రభుత్వ భూములను గుర్తించి నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష, కాడా అధికారి వెంకట్‌రెడ్డి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ కోయ శ్రీహర్ష, కాడా అధికారి వెంకట్‌రెడ్డి

కోస్గి రూరల్, జనవరి 11 : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, కొడంగల్ కాడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కోస్గి తహసీల్దార్ కార్యాలయంలో కోస్గి, గుండుమల్, కొత్తపల్లి, మద్దూర్ మండలాల ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అందులో భాగంగానే కడ ఏర్పాటు చేసిందన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా ఆయా మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సేకరించి వాటిని సర్వేచేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లు, సర్వేయర్లను ఆదేశించారు. అదే విధంగా మండలాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఎక్కడెక్కడ రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు తదితర పనులు ఏమేమీ అవసరమున్నాయో చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు ఏ స్థాయిలో ఉన్నాయి? అవి అసంపూర్తిగా ఉంటే ఎందుకు అలా ఉన్నాయి? బిల్లులు చెల్లించారా? తదితర అంశాలతో నివేదిక ఇవ్వాలన్నారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు, ప్రోత్సహించేందుకు కాడా భాగమౌతుందని, కాడా చేపట్టే కార్యక్రమాలను పర్యవేక్షించడానికి బడ్జెట్ మద్దతును అందించడానికి ప్రణాళికా విభాగం నోడల్ విభాగంగా ఉంటుందన్నారు. సీఎం సహాయ నిధి వినతులను కొడంగల్ క్యాంపు కార్యాలయంలో తీసుకోనున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. ముఖ్యంగా మునిసిపాలిటీ పరిధిలో చేపట్టవలసిన పనులపై కమిషనర్ దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో చేపట్టిన మన ఊరు - మన బడి పనులతో పాటు స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్లు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అక్కడ పనులు పూర్తయ్యాయా? ఎలా పనులు చేశారో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, అనిల్‌కుమార్, జయరాం ఆయా మండలాల సర్వేయర్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోడ్గల్ విద్యార్థులు



జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జడ్చర్ల, జనవరి 11 : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారేపల్లి శ్రీనివాసులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీలలో అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సక్కురామ్, నందినిలు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం శాజాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టునుంచి వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శంకర్‌నాయక్, అశోక్, షరీఫ్, గోబ్రియ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటాపోటీగా సౌత్‌జోన్ నెట్‌బాల్ టోర్నీ



నెట్‌బాల్‌లో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్, జనవరి 11 : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సౌత్‌జోన్ నెట్‌బాల్ టోర్నీలో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. సౌత్‌జోన్ ఫాస్ట్ 5 పురుషులు, మహిళల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో తొలిరోజైన గురువారం తెలంగాణ జట్టు శుభారంభం చేసింది. పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు ఆంధ్రప్రదేశ్‌పై 16-05 స్కోర్‌తో విజయం సాధించింది. అదేవిధంగా కేరళ జట్టు పుదుచ్చేరిపై 29-12 స్కోర్‌తో, కర్ణాటక జట్టు38-04 స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించాయి. ఈ టోర్నీలో దక్షిణ భారతదేశం నుంచి ఆరు రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. 320 మంది క్రీడాకారులు పాల్గొనగా, పోటీలను డీవైఎస్ఓ శ్రీనివాస్ ప్రారంభించారు.

ఇంటి గోడపై మూత్ర విసర్జన చేసిన వ్యక్తికి రూ.8 వేల జరిమానా

మహబూబ్‌నగర్, జనవరి 11 : ఇంటిగోడపై మూత్ర విసర్జన చేసిన వ్యక్తికి కోర్టు రూ.8 వేల జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని కిసాన్‌నగర్‌కు చెందిన బుట్ట బాలస్వామి 30.11.2019న అస్లంఖాన్ వీధికి చెందిన మద్దూరు వెంకటేశ్ ఇంటిగోడకు మూత్ర విసర్జన చేస్తుండగా వెంకటేశ్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో బాలస్వామి అతన్ని దూషిస్తూ కొట్టడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో ఎస్ఐ నిందితుడిపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. గురువారం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీదేవి నిందితుడికి రూ.8 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రామాలయంలో చోరీ

చిన్నంబావి, జనవరి 11 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం గూడెం గ్రామంలోని రామాలయంలో చోరీ జరిగింది. ఆలయంలో ఒక తులం బంగారు ఆభరణాలు దొంగతనం జరిగిందని గ్రామస్థులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కృష్ణఓబుల్‌రెడ్డి ఆలయంలో ఫింగర్ ప్రింట్ తీసుకున్నారు. దొంగలను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

నారాయణపేట, జనవరి 11 : 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం.. నారాయణపేట యాద్గీర్‌రోడ్‌లో గుల్బర్గాకు చెందిన భీమప్ప రేకుల షెడ్‌పై గురువారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిల్వచేసిన పీడీఎస్ బియ్యం 16 క్వింటాళ్లు సీజ్ చేసి, భీమప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉమామహేశ్వర ప్రాజెక్టు వద్దు

- మా భూములు మాకు కావాలి
- ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందజేసిన వివిధ గ్రామాల రైతులు



ఆర్డీవోను కలిసి వినతి పత్రం ఇస్తున్న వివిధ గ్రామాల రైతులు

అచ్చంపేట టౌన్, జనవరి 11 : ఉమామహేశ్వర ప్రాజెక్టుకు సంబంధించిన ఎత్తిపోతల పథకం మాకు వద్దు మా భూములు మాకే కావాలని బల్మూరు మండల పరిధిలోని బల్మూరు, అనంతవరం, మైలారం, అంబగిరి గ్రామాలకు చెందిన రైతులు గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో గోపిరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సత్యనారాయణ మాట్లాడుతూ ఉమామహేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఈ చుట్టూ పక్కల గ్రామాలకు సంబంధించిన పొలాలకు నీరు పారే అవకాశం లేదన్నారు. ఇక్కడ ప్రజలకు లాభం లేని ప్రాజెక్టును కట్టి ఇక్కడి ప్రజల యొక్క భూములను కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ ఎత్తిపోతల పథకంలో ముంపునకు గురయ్యే ప్రజలు చాలామంది పేదలు ఉన్నారని, వారికి సాగు భూమే జీవనోపాధి వారికి ఇక్కడ ఒక్కొక్క రైతుకు 20గంటల నుంచి మూడు ఎకరాల భూమి మాత్రమే ఉందని సూమారుగా 900 ఎకరాల భూమి కావాలంటే దాదాపు 1200 మంది రైతులు భూమిని కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన రైతుల భూములు ఉన్నాయని, ఆ భూములు కోల్పోతే వారు రోడ్డున పడే పరిస్థితి ఉందని అధికారులు చొరవ చూపి అక్కడ ప్రాజెక్టు నిర్మాణం వంటి పనులు లేకుండా చూడాలని కోరుతున్నామన్నారు. ఆయా గ్రామాల రైతులు చెన్నయ్య, జానకి రాములు, నాగరాజు, సాయిలు, వెంకటస్వామి, ఈదమయ్య పాల్గొన్నారు.

కూలీలపై దూసుకెళ్లిన పాల వ్యాన్

- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- జాతీయ రహదారిపై ప్రమాదం



ప్రమాదానికి కారణమైన పాల వ్యాను



సీతారాములు (ఫైల్)



రమేష్ (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, జనవరి 11 : జాతీయ రహదారిపై పనిచేస్తున్న ఇద్దరు కులీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలో చోటుచేసుకున్నది. పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రమాద సుచికలను సరిచేస్తున్న ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన సేఫ్టీ వాహనం డ్రైవర్ రమేష్ (30)తో పాటు కూలీలు లక్ష్మీదేవమ్మ, పుల్లూరు గ్రామానికి చెందిన సీతారాములు (47), సుధాకర్‌లపైకి హైదరాబాద్ నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న పాలవ్యాను దుసుకెళ్లింది. దీంతో నలుగురికి తీవ్రగాయాలు కాగా వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్దిసేపటికే రమేష్, సీతారాములు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సీతారాములుకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. రమేష్‌కు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. మిగతా ఇద్దరు కల్లూరు చెందిన లక్ష్మీదేవమ్మ, మానవపాడు మండలం, అమరవాయి గ్రామానికి చెందిన సుధాకర్ చికిత్స పొందుతున్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం..

44వ నెంబర్ జాతీయ రహదారిపై నిత్యం వందలాది మంది పని చేస్తుంటారు. వారికి ఆవసరమైన భద్రత కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. సాధారణంగా జాతీయ రహదారిపై కులీలు పని చేస్తుంటే వారి వెనుక ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక క్రాష్‌బ్యారియార్స్ వద్ద ఫ్లాగ్‌మెన్‌ను నియమించాల్సి ఉంటుంది. కానీ, గురువారం జరుగుతున్న పనుల వద్ద ఫ్లాగ్‌మెన్ లేకుండానే కులీల చేత పనులు చేయించారని తోటి సిబ్బంది తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక హైవే అధికారులను ప్రశ్నించగా రమేషే ఫ్లాగ్‌మెన్ అని చెప్పారు. ఒక వ్యక్తితో రెండు పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించగా నీళ్లనమిలారు. గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించిన రమేష్ గత రెండునెలల క్రితమే వాహన డ్రైవర్ ఉద్యోగ నిమిత్తం విధుల్లో చేరాడు. ఇతను సేఫ్టీ వాహనం నడపడమే గాక ఇతడితో సేఫ్టీకి ఆవసరమైన సుచిక బోర్డులను రోడ్డు వెంట సరి చేసుకుంటూ రావాలని ఆదేశించారు. ఇలా సంబంధంలేని పనులు చేయించడం వల్లే చనిపోయాడని రమేష్ బంధువులు ఆరోపిస్తున్నారు. ఇక పుల్లూరు గ్రామానికి చెందిన సీతారాములు ఆఫీస్ బాయ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడని గురువారం రోడ్డు వెంట పనికి పంపడం వల్లే ప్రమాదం జరిగిందని సదరు గ్రామస్థులు ఆరోపించారు.

యువకుడి రిమాండ్

రేవల్లి, జనవరి 11 : బాలిక అదృశ్యం కేసులో పోలీసులు ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించారు. వనపర్తి జిల్లా రేవల్లి ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల డిసెంబర్‌లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ బాలికను నమ్మించి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు వెంకటేశ్‌పై అనుమానం వ్యక్తం చేయగా బుధవారం హైదరాబాద్‌లో బాలికతో పాటు, వెంకటేశ్‌ను పోలీసులు గుర్తించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంకటేశ్‌ను గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు అతనికి 14 రోజులు రిమాండ్ విధించిందని ఎస్సై తెలిపారు.

'మనఊరు-మనబడి' పనుల పరిశీలన

జడ్చర్ల, జనవరి 11 : జడ్చర్ల మండలం పెద్దఆదిరాలలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మనఊరు-మనబడి కార్యక్రమంలో జరుగుతున్న పనులను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, మంజూరైన నిధులతో ఎంత మొత్తం వెచ్చించారనే అంశాన్ని హౌసింగ్‌శాఖ ఈఈ వైద్యం భాస్కర్, ఏఈలు జేఎస్ ఆర్ కుమార్, నాగేందర్‌గౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు బోధిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రశ్నించిన వాటికి విద్యార్థులు చెప్పిన సమాధానాలకు అభినందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఉపాధ్యాయులు ఆనందం, అనురాధ, నరసింహులు, నార్యానాయక్, మధు, శ్యాంసుందర్, వెంకటయ్య, సంధ్య, కృష్ణనాయక్, శ్రీదేవి, తాహెర్ పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ పకడ్బందీగా చేయాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దేవరకద్ర, జనవరి 11 : ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నందున పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లచేత అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులో నింపిన ప్రతీలబ్ధిదారుడి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆపరేటర్లతో మాట్లాడుతూ ఒక ఫారంలోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. ఒకటి 10 నిమిషాల సమయం పడుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ బి. శ్రీనివాసులు, ఉప తహసీల్దార్ శివరాజు, సుజన్, సురేష్ పాల్గొన్నారు.

వెన్నాచేడ్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

గండీడ్, జనవరి 11 : మండలంలోని వెన్నచేడ్, లింగాయిపల్లి గ్రామాలలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్ర్కీన్ ద్వారా కేంద్ర పథకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈశ్వరప్ప, రాములు మాట్లాడారు. కేంద్ర పథకాలను వివరించారు. ఉజ్వల గ్యాస్, ఉచిత బియ్యం, ముద్ర రుణాలు, ఆయుష్మాన్ భారత్, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, పీఎం కిసాన్ పథకాల గురించి వివరించారు. అదేవిధంగా డ్రోన్ ద్వారా పంట పొలాలకు మందులు పిచికారి చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, బ్యాంక్ మేనేజర్ శంకర్‌నాయక్, సర్పంచు పుల్లారెడ్డి, ఏఈవో మహేష్, గోపాల్ బాలయ్య, బాలరాజు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం

- అప్పంపల్లిలో వివేకానందుని జయంతి

చిన్నచింతకుంట, జనవరి 11 : స్వామి వివేకానందుని జీవిత చరిత్రను ప్రతీ విద్యార్థి చదవాల్సిన అవసరం ఉందని జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ సూచించారు. గురువారం కౌకుంట్ల మండలంలోని అప్పంపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద జయంతివేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని జీవిత విశేషాలు, ఆయన ఆశయాలు నేటి యువతకు దిక్సూచీ వంటివని అన్నారు. ప్రతీ విద్యార్థి చిన్న తనం నుంచే చదువుతో పాటుగా దేశభక్తి నాయకుల జీవిత చరిత్రలను చదవటం వల్ల దేశభక్తి మరింత పెరిగేందుకు దోహదపడుతుందని తెలిపారు. స్వామి వివేకానందుని జీవిత విశేషాలకు సంబంధించి, అరుదైన చిత్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాలమూరు : స్వామి వివేకానందుడు అందరికీ ఆదర్శమని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి అన్నారు. వివేకానందుడి జయంతి సందర్భంగ 10, 11, 12వ తేదీల్లో ముగ్గులు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీన పాలమూరు యూనివర్సిటీలో రక్తదానం శిబిరం ఏర్పాటుచేసి సమాజానికి స్ఫూర్తి నింపామన్నారు. గురువారం ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలలో విద్యార్థినులు అధికసంఖ్యలో పాల్గొని ఇతరులకు స్ఫూర్తినిచ్చారు. శుక్రవారం క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు రాఘవేందర్‌రెడ్డి, డా.స్వరూప, నాగరాజు, చారి, ఖాదర్‌అలీ, బాలరాజు, వీణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన డబుల్ ఇళ్ల బాధితులు

నవాబ్‌పేట, జనవరి 11 : మండలంలోని యన్మనగండ్ల గేట్ వద్ద గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ ఇళ్లను తమకే ఇవ్వాలంటూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న యన్మనగండ్ల గ్రామస్థులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలమైన తమకు ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు కేటాయించిన ఇళ్లను తమకే ఇవ్వాలని వారు తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్ ఇళ్లను తమకు అప్పజెప్పలేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నిర్ణయం తీసుకుంటామని అన్నారు. బాలమ్మ, రాములు, శేఖర్, యాదయ్య, అంజమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

బాలానగర్, జనవరి 11 : విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సంఘం ముఖ్య సలహాదారులు చక్రంచారి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో సంఘం క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం మారోజువీరన్న, ప్రొఫెసర్ జయశంకర్ సార్, శ్రీకాంతచారిల త్యాగపురుషుల ద్వారానే వచ్చిందన్నారు. విశ్వబ్రాహ్మణులు సంఘటితం కావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమవంతుగా రూ.లక్ష సహాయం చేయనున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు మాధవచారి, గోవిందచారి, రవిచారి, రవికుమార్‌చారి, ఆంజనేయులుచారి, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని అమలు చేయాలి



అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావుకు వినతి ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 11 : గత ప్రభుత్వం రాష్ట్రంలోని దళితుల అభ్యున్నతికి చేపట్టిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని జిల్లాలోని దళితబంధు లబ్ధిదారులు, వివిధ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల భవన సముదాయ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల ఆర్థిక అభ్యున్నతికోసం ప్రత్యేకంగా దళిత బంధును తీసుకవచ్చి జిల్లాలో 2,982 మంది దళిత కుటుంబాలను ఎంపిక చేసి వారి చేత బ్యాంక్ అకౌంట్లను కూడా తెరిపించిందన్నారు. ఈ పథకంపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని, దళిత బంధు-2 పథకాన్ని అమలు చేసి అకౌంట్లలో డబ్బులు జమచేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావును కలిసి విజ్ఞాపనపత్రాన్ని సమర్పించారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కాడం ఆంజనేయులు, దేవరకద్ర ఏఎంసీ మాజీ ఛైర్మన్ డి.ఆంజనేయులు, నవాబ్‌పేట మాజీ ఎంపీపీ శ్రీనివాస్, భూత్పూర్ మండల అధ్యక్షుడు బోరింగ్ నర్సిములు, రాజమల్లు, బచ్చన్న, పెద్ద జంబులయ్య రాములు, బాలయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధారాల్లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు

- మాజీ మంత్రిపై ఆరోపణలను ఖండించిన మునిసిపల్ ఛైర్మన్ నర్సింహులు

మహబూబ్‌నగర్, జనవరి 11 : కాంగ్రెస్ నాయకులు ఆధారాల్లేకుండా ఇష్టానుసారంగా మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణలు చేయడం సరికాదని మునిసిపల్ ఛైర్మన్ కోరమోని నర్సింహులు అన్నారు. పాలమూరులో అభివృద్ధి ఫలాలు అనుభవించుకుంటూ తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. పురపాలిక అభివృద్ధికి రూ.100కోట్ల నిధులు మాజీ మంత్రి తీసుకువచ్చారని, ఇప్పటికే టెండర్లు జరిగిన పలు చోట్ల పనులు ప్రారంభమయ్యాయని, బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చారని, కాంగ్రెస్ వచ్చాక పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్లతో బంద్ చేయించారన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పుడు జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉన్నందున మీరు ఎక్కువ నిధులు తీసుకురావాలని సూచించారు. మాట్లాడితే అరాచకం, ప్రభుత్వ భూముల కబ్జా అని మాట్లాడుతున్నారని, ఎక్కడ భూములు కబ్జా చేశారో చూయించాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి ముందుభాగంలో మాజీమంత్రి కుటుంబసభ్యుల పేరిట 99 సంవత్సరాలకు షాపింగ్ మాల్‌కు ఇచ్చారని, అగ్రిమెంట్ చేశారని, ఆరోపించడం కాదని, ఎక్కడ చేశారో నిరూపించాలని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ముడా ఛైర్మన్ గంజి ఎంకన్న, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ కోరమోని వెంకటయ్య, వైస్‌ఛైర్మన్ గణేష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాసులు, వేద, ప్రశాంత్, నవకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం వేగవంతం చేయాలి

- కూలీల సంఖ్యను పెంచాలి

- జడ్పీ స్థాయీ సంఘం సమావేశంలో ఛైర్‌పర్సన్ స్వర్ణమ్మ



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

మహబబూబ్‌నగర్, జనవరి 11 : ఉపాధిహామీ పథకం ఆశించిన స్థాయిలో జరగడం లేదని, జాబ్‌కార్డులున్న వారందరినీ పనిలోకి తీసుకురావడంలో విఫలమవుతున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అన్నారు. జాబ్‌కార్డులను బట్టి మరింత మందికి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రెండవ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఈ పథకం కింద జిల్లాలో 1.38లక్షల జాబ్‌కార్డ్‌లు ఇచ్చామని, వారందరికి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా హార్టికల్చర్‌లో పెద్దఎత్తున పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉన్న రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు పండ్ల తోటలు సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. గిరి వికాస పథకం, చేనేత, జౌళి, దేవాదాయ, యువజన, క్రీడల శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాలని చెప్పారు. అధికారులు ప్రణాళిక తయారు చేసుకొని పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ముస్నీ, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే, యోగా అవసరం

- ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



భూత్పూర్ కసూర్బాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జనవరి 11 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు విద్యతో పాటు యోగా, కరాటే వంటివి చాలా అవసరమని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర పాఠశాలల స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఏర్పాటు మెడల్స్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగా, కరాటే వంటి వాటిల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కస్తూర్బాగాంధీలో మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల ఎస్‌వో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టి ఆనంద్‌కుమార్, కెంద్యాల నరేందర్, ఎంఈవో నాగయ్య, కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్‌వో ప్రశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వంత డబ్బుతోనైనా టాయిలెట్లు నిర్మిస్తా : ఎమ్మెల్యే

అడ్డాకుల : మరికొన్ని రోజుల్లోనే అడ్డాకుల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ లేదా తన స్వంత నిధులతోనైనా టాయిలెట్లు నిర్మిస్తానని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం అడ్డాకుల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 మంది విద్యార్థులు ఉన్నా టాయిలెట్లు, కనీస వతులు లేకపోవడంపై ఆవేదన చెందారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్న భోజన విరామంలో విద్యార్థులు టాయిలెట్లు నిర్మించాలని బైఠాయించిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే వెంటనే ఆ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచు మంజుల, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఉపసర్పంచు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీసెల్ అధ్యక్షుడు షఫీహమ్మద్, శరత్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

పీఠం దక్కేదెవరికో ?

- ఈనెల 27న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లపై అవిశ్వాసం

- ఛైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడం లాంఛనమే.. వైస్‌ఛైర్మన్‌పై ఉత్కంఠ

- ఎవరికివారు ప్రయత్నాలు

మహబూబ్‌నగర్, జనవరి 11 : పురపీఠం దక్కించుకునేందుకు అధికార పార్టీ ఎత్తులు వేస్తుండగా, సిట్టింగ్ స్థానాన్ని కోల్పోకుండా తమ పార్టీకి చెందిన వ్యక్తినే ఛైర్మన్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న కోరమోని నర్సింహులు, వైస్ ఛైర్మన్ తాటిగణేష్‌పై 30 మంది సభ్యులు గత వారం అవిశ్వాసతీర్మాన నోటీసు కలెక్టర్‌కు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఛైర్మన్‌పై, మధ్యాహ్నం 12:30 గంటలకు వైస్‌ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణానికి సంబంధించిన ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించిన అధికారులు సభ్యులందరికీ నోటీసులు జారీచేశారు. 27న హాజరైన వారిలో సగానికన్నా ఒకరు ఎక్కువగా అవిశ్వాసానికి మద్దతిస్తే తీర్మానం నెగ్గుతుంది. లేదంటే వీగిపోతుంది. ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడం లాంఛనమేనని స్పష్టమవుతోంది. ఇప్పటికే 30 మంది సభ్యుల సంతకాలతో తీర్మానం కోసం నోటీసు ఇవ్వగా మిగిలిన బీఆర్ఎస్ సభ్యులు కూడా ఛైర్మన్‌ను దించాలనే అభిప్రాయంతోనే ఉన్నారు. అదే సమయంలో తమ పార్టీకే చెందిన కోరమోని వనజను ఛైర్మన్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను ఛైర్మన్ చేయాలని నిర్ణయించింది. దీంతో వీరిద్దరి మధ్య పోటీ నెలకొననుంది. ఛైర్మన్‌ను తొలగించిన తరువాత కొత్తగా ఛైర్మన్‌ను ఎన్నుకునేందుకు అధికారులు మరో తేదీ నిర్ణయించే అవకాశం ఉంది. ఆరోజు సభ్యులు హాజరై ఛైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ విపక్షాలు, బీఆర్ఎస్ చీలిక అసంతృప్తి కౌన్సిలర్ల మద్దతుతో సులభంగా పీఠం దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేస్తుండగా బీఆర్ఎస్ కూడా తమ కౌన్సిలర్లు చేజారిపోకుండా అసంతృప్తులను బుజ్జగించే పనిలో పడింది.

● వైస్‌ఛైర్మన్‌పై ఉత్కంఠ : ఛైర్మన్‌తోపాటు వైస్‌ఛైర్మన్‌పైనా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనుండటంతో ఛైర్మన్‌కు అందరూ మద్దతిస్తున్నా వైస్‌ఛైర్మన్‌ను మాత్రం మార్చొద్దని బీఆర్ఎస్ గట్టి పట్టుదలతో ఉంది. బీఆర్ఎస్‌లోనే వైస్ ఛైర్మన్‌కోసం ఓ మైనారిటీ సభ్యుడు అడుగుతుండగా పార్టీ మాత్రం గణేష్‌ను మార్చొద్దనే నిర్ణయించినట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ వైస్‌ఛైర్మన్‌పై మెజారిటీ సభ్యులతో అవిశ్వాసానికి అనుకూలంగా ఓట్లు వేయిస్తే వైస్‌ఛైర్మన్ కూడా పదవి నుంచి తొలగాల్సి వస్తుంది.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..ఇల్లు జాగ్రత్త

- ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, జనవరి 11 : సంక్రాంతి పండగకు ఊరెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్త పడాలని ఎస్పీ హర్షవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చాలామంది పట్టణాల నుంచి గ్రామాలకు పమయనమవుతున్నందున ఇళ్లకు తాళాలు పడితే దొంగలు పడే అవకాశం ఉన్నందున ఇంట్లో విలువైన నగలు, నగదు లేకుండా జాగ్రత్త పడాలని కోరారు. ఇప్పటికే పోలీస్‌శాఖ పరంగా అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టామని పెట్రోలింగ్, గస్తీ పెంచడం జరుగుతుందన్నారు. ప్రజలకు దొంగలు దొంగతనాలు చేసేందుకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విలువైన వస్తువుల సమాచారం వ్యక్తిగత ఆర్థిక వివరాలు ఇతరులకు చెప్పకుండా జాగ్రత్తపడాలన్నారు. బీరువా తాళాలు ఇంట్లో ఉంచవద్దని, ఇంటికి తాళం వేసినప్పుడు తాళం కనపడకుండా డోర్ కర్టన్ వేసుకోవాల న్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వెలిగేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఎక్కువరోజులు ఊరెళ్లేవాళ్లు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కాలనీలలో అనుమానిత వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100కు కాల్ చేసి చెప్పాలని ఎస్పీ వెల్లడించారు.

నేడు గోపన్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం

దేవరకద్ర, జనవరి 11 : మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సందయ్యగారి నారాయణరెడ్డి-రుక్మమ్మల జ్ఞాపకార్థంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నా మని, కనుక పట్టణ ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

జడ్చర్ల, జనవరి 11 : విద్యార్థులకు పునాది స్థాయి నుంచే సామర్థ్యాలను పెంచాలని జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి అన్నారు. జడ్చర్లలోని మండల వనరుల కేంద్రంలో గురువారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉనవత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు శిక్షణ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జూనియర్ బాలికల జట్టు ఎంపిక

జడ్చర్ల, జనవరి 11 : హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఈ నెల 12న హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2004 జనవరి 1 అనంతరం పుట్టిన క్రీడాకారులకు అవకాశం ఉంటుందని, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఎంపిక ప్రక్రియకు హాజరుకావాలన్నారు.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జనవరి 11 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం ఎన్‌టీఆర్ మహిళల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. మహిళలు, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని బహుమతులు అందుకోవాలని ఆయన కోరారు.

రాత్రి 9 గంటల వరకు బస్సులు నడపాలి

- తహసీల్దార్ మల్లికార్జున్ రావుకు ఉద్యోగుల వినతి

నవాబ్‌పేట, జనవరి 11 : మండల కేంద్రమైన నవాబ్‌పేట నుంచి మహబూబ్‌నగర్ వరకు రాత్రి తొమ్మిది గంటల వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌కు మండలంలో వివిధశాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రాత్రి ఏడు దాటితే జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉండటం లేదని, రాత్రి వేళ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉప తహసీల్దార్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'సేవాలాల్ మహరాజ్ జయంతి రోజు సెలవుగా ప్రకటించాలి'

పాలమూరు, జనవరి 11 : సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని గోర్‌సేన నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బంజారాలకు గత ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందన్నారు. కార్యక్రమంలో ఛత్రపతి, సంతోష్, రాథోడ్, రాజేష్, రఘు, అశోక్, మహేష్, రఘు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

రాజాపూర్, జనవరి 11 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలికలకు ముత్యాల ముగ్గుల పోటీలు, బాలురకు పతంగుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీలల్లో పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. ఉపాధ్యాయులు పోటిలో ప్రతీభ కనభర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని..

జడ్చర్ల, జనవరి 11 : జడ్చర్ల మునిసిపాలిటీలో పలు చోట్ల సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ, స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని జడ్చర్ల మునిసిపాలిటీలోని 24వ వార్డులో కౌన్సిలర్ కోట్లప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ విజేతకు రూ.5116, ద్వితీయ బహుమతికి రూ.3116ల నగదు బహుమతిని అందచేసారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఎర్రగుట్ట సమీపంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో ఐద్వా, అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు.

పాఠశాల విద్యార్థినులకు ...

దేవరకద్ర, జనవరి 11 : మండల కేంద్రంలోని ఉన్న అనూషకాన్వెంట్ హైస్కూల్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పాఠశాల కరస్పాండెంట్ మణెమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీ రంగు రంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, కల్పన, విశ్వప్రభ పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా..

- స్వామి వారిని దర్శించుకున్న భక్తులు



కురుమూర్తిస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, జనవరి 11 : కురుమూర్తి వేంకటేశ్వరస్వామి క్షేత్రం గురువారం అమావాస్య పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. గోవిందా.. గోవిందా.. శ్రీకురుమూర్తివాసా గోవిందా అంటూ గోవింద నామంతో పులకించిపోయింది. భక్తుల రాకతో వివిధ రకాల దుకాణ సముదాయాలు వెలిశాయి. భక్తులు కొండగుట్టల్లో దాసంగాలు పెట్టి, స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

పరుసవేదీశ్వరస్వామి దేవాలయంలో..

జడ్చర్ల : మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని కుర్వగడ్డపల్లి, దుందుభీ నది పరివాహకంలోని శ్రీపరుసవేదీశ్వరస్వామి దేవాలయంలో గురువారం రాత్రి ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతి, పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. రాత్రి అఖండభజన కార్యక్రమాన్ని చేపట్టారు. పూజ కార్యక్రమాలను అమర్నాథ్‌రెడ్డి, అనిత దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, పర్వతాలు, సుదర్శన్, బద్రప్ప, కృష్ణ, దామోదర్ పాల్గొన్నారు.

శబరికి బయలు దేరిన అయ్యప్ప స్వాములు

కోయిలకొండ : మండల కేంద్రంలో 41 రోజులు అయ్యప్ప మాల వేసి పవిత్రంగా దీక్ష చేసిన అయ్యప్ప స్వాములు గురువారం శబరికి బయలుదేరారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ఇరుముడులు కట్టుకొని యాత్రకు బయలుదేరారు. కార్యక్రమంలో గ్రామస్థులు భారీగా పాల్గొని పూజా విజయవంతం చేశారు. సర్పంచు కృష్ణయ్య, నాయకులు జగన్, విద్యాసాగర్, రాజు, లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు

దేవరకద్ర : ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు అని, సమాజంలో ప్రతీ ఒక్కరు ఆయన అడుగుజాడలో నడవాలని పేరుర్ సర్పంచ్ చమన్ అన్నారు. గురువారం కౌకుంట్ల మండల పరిధిలోని పేరుర్ గ్రామంలో ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శ్రీరామ జన్మభూమి అంక్షింతల శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ శ్రీరాముడి అంక్షితలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీనివాసులు, కిష్టన్న, రవి, రాములు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తాం

- హెచ్‌డీఎస్ సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జనవరి 11: ఉమ్మడి జిల్లాకు వరంగా ఉన్న జనరల్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆసుపత్రి సమావేశమందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రవినాయక్‌లు హాజరై మాట్లాడారు. ముందుగా సమావేశ ముఖ్య అతిథి జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, అంతేకాకుండా ఆసుపత్రిలో అవసరమైన మెడికల్ సామగ్రిని అందుబాటులోకి తీసుకొస్తే ఎక్కువమందికి సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి ఆదాయ మార్గాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఆదాయం సమకూర్చుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కలెక్టర్ రవినాయక్ మాట్లాడారు. నెలకొకసారి హెచ్‌డీఎస్ సమావేశాన్ని నిర్వహించాలని, 15 రోజుల్లో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. మంజూరైన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అంతకు ముందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జీవన్ మాట్లాడారు. సమావేశంలో మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కృష్ణ, ఆసుపత్రి మాజీ సూప రింటెండెంట్ డాక్టర్ శామ్యూల్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్, టీఎస్ ఎంఎస్ఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సాదత్, రాఘవేందర్, కేఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటాలి : ఎమ్మెల్యే

పాలమూరు : వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు చాటిచెప్పాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాస్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన వారసులు కోరగా, అందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వడ్డెరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, వడ్డెర సంఘం సభ్యులు పి.యాదయ్య, వెంకటయ్య, ఊశన్న, చంద్రయ్య, పి.సురేష్, ఎ.శ్రీను, వెంకటేష్, యాదయ్య లయన్ నటరాజు, సి.జె బెనహర్, మల్లు నరసింహారెడ్డి, ఆర్.శేఖర్, లింగంనాయక్, నరసింహులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం

పాలమూరు, జనవరి 11 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిబ్రవరి 16న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి అధజకధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే సాధించుకున్న కార్మికుల హక్కులను తుంగలో తొక్కటం దారుణమన్నారు. కార్మికులు, ప్రజలను చీలుస్తూ మతోన్మాద విధానాలను ప్రవేశపెట్టి ఓట్లను రాబట్టుకోవటానికి కార్మికులు, రైతులు, ప్రజలను పోరాటాల వైపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, సత్తయ్య, గాలెన్న, తిరుమలయ్య, చంద్రకాంత్, వేణుగోపాల్, గోనెల రాములు, మణికొండ రాజు, పడాల వెంకటయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

12న పాలమూరులో ధ్యాన కేంద్రం ఏర్పాటు

పాలమూరు : ధ్యానంతో మనుషులు ప్రశాంత జీవనం సాగించాలన్న హార్ట్ ఫుల్లర్ సంస్థ ముఖ్య ఉద్దేశమని రాఘవేందర్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిమనిషి సాటిమనిషికి తోడ్పడుతూ సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలన్నారు. 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వరకాలనీలో నూతన ధ్యాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర కాలనీలో హార్ట్ ఫుల్లర్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ యవజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నూతన ప్రాంగణాన్ని జోనల్ కో-ఆర్డినేటర్ కృష్ణారావు ప్రారంభిస్తారని తెలిపారు. ప్రపంచంలో 166 దేశాలలో సేవలు అందిస్తున్న సంస్థ నేడు మహబూబ్‌నగర్ ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా ధ్యానం, యోగ, ముద్రలు, మానసిక ప్రశాంతతను అందించటానికి కృషి చేయనుందని అన్నారు.